అయిదేళ్లలో పలువురు బదిలీ..

గడిచిన అయిదేళ్లలో పలువురు కమిషనర్లు విధుల్లోకి రావడం.. దీర్ఘకాల సెలవు పెట్టి బదిలీ చేయించుకోవడం సాధారణంగా మారింది. అక్రమాలకు సహకరిస్తే ఉద్యోగానికి ముప్పు ఉందనే భయంతో ఎం.రవిబాబు 2019 అక్టోబరు 16న సెలవులో వెళ్లారు. డీఈగా ఉన్న లచ్చిరెడ్డికి కమిషనర్‌గా 2020లో బాధ్యతలు ఇవ్వగా ఆయనపై ఆరోపణలు రావడంతో సెలవులో వెళ్లారు. జయంత్‌కుమార్ అనే కమిషనర్ సైతం 2020 జూన్ 18న సెలవులో వెళ్లారు. పలు కార్యక్రమాలతో ప్రజలతో మమేకమైన మారుతిప్రసాద్ 2021 జులై 21న సెలవు తీసుకోక తప్పలేదు. ఇంధన వినియోగంలో తన మార్కు చూపించిన స్వరూపరాణి ప్రజాప్రతినిధులకు సహకరించడలేదనే విమర్శలతో ముప్పుతిప్పలు పెట్టడంతో 2022 సెప్టెంబరు 4న దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు.

ఉండాలంటే.. మా మాట వినాల్సిందే!

- జిల్లా కేంద్రం పురపాలిక పాలకవర్గ సభ్యుల్లో కొందరి తీరు
- విధుల నిర్వహణకు అధికారుల అనాసక్తి



జగిత్యాల పురపాలిక

న్యూస్‌టుడే, జగిత్యాల పట్టణం

జగిత్యాల పురపాలికలో పాలకవర్గ సభ్యుల ఒత్తిడి, పాలనా వ్యవహారాల్లో అడుగడుగునా అడ్డు తగులుతుండటంతో కమిషనర్లు రావడం.. కొద్ది రోజులకే వెళ్లిపోవడం రివాజుగా మారింది.. ప్రస్తుత కమిషనర్ సమ్మయ్యతోనూ పాలకవర్గం అలానే వ్యవహరిస్తుండటంతో అంతర్గతంగా విభేదాలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది..

పుర కమిషనర్‌గా పనిచేసిన అనిల్ భూ కుంభకోణంలో అరెస్టు కావడంతో ఆ పోస్టు ఖాళీగా ఉండిపోయింది. ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా జులై 3న సమ్మయ్య కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. విధుల్లో చేరడంతోనే ఆయన పలు విభాగాల్లో అక్రమాలను నిరోధించడంపై దృష్టి పెట్టారు. పుర పాలనలో ఆయన తీసుకున్న నిర్ణయాలను కొందరు కౌన్సిలర్లు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల పురపాలికలో కొందరు ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. ఇందులో ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు చేతివాటం చూపారు. మరోవైపు కొందరు సిబ్బందిని కార్యాలయంలో అంతర్గత బదిలీలు చేయాలని కమిషనర్‌పై తీవ్ర ఒత్తిడి పెరిగింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించనని ఆయన స్పష్టం చేయడంతో పాలకవర్గ సభ్యులు తట్టుకోవడం లేదని సమాచారం. విషయం ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విప్ లక్ష్మణ్‌కుమార్ దృష్టికి ఇరువర్గాలు తీసుకెళ్లగా ఎవరైనా నిబంధనల మేరకు పనిచేయాలని వారు సూచించినట్లు సమాచారం. అయినా కమిషనర్‌పై పాలకవర్గ సభ్యులు కొందరు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.

అక్రమాలే కారణమా..?

పురపాలక సంఘంలో తరచూ పలు విభాగాల్లో అక్రమాలు వెలుగు చూడటంతో కమిషనర్లు దీర్ఘకాలిక సెలవులో వెళ్లడం లేదా ఇతర ప్రాంతాలకు బదిలీలకు ప్రయత్నించడమో జరుగుతోంది. గతంలో ఓ ఇంటి నిర్మాణ అనుమతి విషయమై పట్టణ ప్రణాళిక విభాగంలో అనిశా దాడి చేయడంతో ఓ టీపీఎస్, పొరుగు సేవల ఉద్యోగి పట్టుబడటం సంచలనం కలిగించింది. గతేడాది రెవెన్యూ విభాగంలో దొంగ రశీదులు సృష్టించినందుకు ఓ సీనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్ సస్పెండ్ కావడంతోపాటు అరెస్టయ్యారు. తాజాగా భూ కుంభకోణంలో కమిషనర్ అనిల్, ఆర్వో ప్రసాద్ సస్పెండ్ కావడంతో పాటు కటకటాల్లోకి వెళ్లారు. మరోవైపు ఇంధన వినియోగంలో అక్రమాలపై సీడీఎంఏ విచారణ కొనసాగుతోంది. పారిశుద్ధ్య నిర్వహణ, వాహనాల మరమ్మతులకు సంబంధించి కూడా విజిలెన్స్ విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. కొందరు అధికారులు సొంతంగా అక్రమాలకు అలవాటు పడగా.. మరికొందరు పాలకవర్గం ఒత్తిడి తట్టుకోలేక నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుని అక్రమాల్లో పాలుపంచుకున్నట్లు తెలుస్తోంది.

వ్యర్థాల తొలగింపు

ధర్మపురి, న్యూస్‌టుడే: ధర్మపురి పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో బయో మెడికల్ వ్యర్థాలను బుధవారం తొలగించారు. ఈనాడులో బుధవారం 'భయపెడుతున్న బయో మెడికల్ వ్యర్థాలు' శీర్షికన వెలువడిన కథనానికి స్పందించిన కలెక్టర్ సత్యప్రసాద్ చర్యలు తీసుకోవాలని ఆరోగ్య కేంద్రం వైద్యులను ఆదేశించారు. ఈ మేరకు వైద్యులు గుత్తేదారుతో మాట్లాడి పారిశుద్ధ్య కార్మికుల సహాయంతో తరలించారు.

స్పందనకు వందనం

నారసింహుడి భక్తులకు తాగునీటి సమస్యలు



ఆలయం బయట సంపులో నీటిని నింపుతున్న ట్యాంకర్

న్యూస్‌టుడే, ధర్మపురి: ఏటా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి భక్తులకు తాగునీటి సమస్యలు తీవ్రమవుతున్నాయి. ప్రతిరోజు తాగునీటి సమస్య ఉంటుండగా.. రద్దీ వేళల్లో అధికంగా ఉంటుంది. ప్రతిరోజు స్వామివారి దర్శనానికి 3 నుంచి 5 వేల మంది భక్తులు వస్తుంటారు. 1.50 లక్షల లీటర్ల నీరు అవసరం అవుతోంది. దివంగత మాజీ మంత్రి జె.రత్నాకర్‌రావు హయాంలో ప్రత్యేకంగా చొరవ తీసుకుని.. భక్తుల భాగస్వామ్యంతో శుద్ధజల నీటి పథకాన్ని ఆలయం పక్కన ఏర్పాటు చేయించారు. అయితే ఇది నిర్వాహణ లోపంతో మూలన పడింది. బోరు ఉన్న సరిగ్గా పనిచేయడం లేదు. దీంతో ప్రస్తుతం గోపురాల ముందు ఓపెన్ సంపును ఏర్పాటు చేశారు. పురపాలక ట్యాంకర్ల ద్వారా ఇందులో వ్యవసాయ బావులు, గోదావరి నీటిని నింపి ఆలయంలోకి నల్లా కనెక్షన్ ఇచ్చారు. ఈ నీటితోనే భక్తులు కాళ్లు, చేతులు కడగడంతో పాటు తాగటానికి ఉపయోగిస్తుండగా.. ఆలయ సిబ్బంది అయితే వంటపాత్రలు శుభ్రం చేస్తున్నారు. ఇలా అపరిశుభ్రమైనా నీటితో భక్తులకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

ప్రతిపాదనలకే పరిమితం

తలాపునే గోదావరి ఉన్నా.. నరసింహుని భక్తులకు నదీ జలాలు అందడం లేదు. ఆలయంలో పూర్తిస్థాయిలో శుద్ధ జలాలు అందించాలనే ఉద్దేశంతో గోదావరి నుంచి పైపులైను వేసి.. 4 మిలియన్ లీటర్ల ప్యూరిఫై ప్లాంటు కోసం 2018లో గతంలో అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలకే పరిమితమైంది తప్ప పనులకు మాత్రం మోక్షం లభించ లేదు. శాశ్వతంగా ప్రత్యేక శుద్ధజల పథకాన్ని దేవస్థానంలో ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?



అడుగు భాగంలో కూలిపోయిన వంతెన

ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న వంతెన కూలి ప్రమాదం జరిగితే బాధ్యులెవరని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. బీర్‌పూర్ మండలంలోని ఇందిరానగర్ నుంచి ధర్మపురి మండలానికి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని రోళ్లవాగు ప్రధాన కాలువపై డీఎల్ ఆర్‌బీ వద్ద వంతెన అడుగు భాగంలో పూర్తిగా బండరాళ్లు కూలిపోయి ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న వంతెనకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వాహన దారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సారంగాపూర్

పాఠశాల భవనానికి మోక్షమెప్పుడు?



కోరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడాదిగా పిల్లర్ల దశలోనే నిర్మాణం

కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'మన ఊరు-మన బడి' కింద గతేడాది రూ.1.50 కోట్లతో నూతన భవనం, భోజనగది, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. భవన నిర్మాణం కోసం పిల్లర్లను ఏర్పాటు చేయగా శాసనసభ ఎన్నికలు రావడంతో గుత్తేదారు పనులను మధ్యలోనే వదిలేశారు. నూతన భవన నిర్మాణం పూర్తయితేనే తరగతి గదుల సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. - న్యూస్‌టుడే, కోరుట్ల

అసంపూర్తి పనులు.. విద్యార్థుల అవస్థలు



చేతిపంపు నీటిని తాగుతున్న విద్యార్థులు

మెట్‌పల్లి బల్దియా పరిధిలోని సింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద ఎంపిక చేసి రూ.2 లక్షలు కేటాయించారు. పాఠశాలలో ఒకే గది ఉండగా 15 మంది విద్యార్థులు ఉన్నారు. తాగునీటి కోసం మిషన్ భగీరథ కుళాయి కనెక్షన్ ఇచ్చి నీటి నిల్వ కోసం సంపు పనులు చేపట్టినా అసంపూర్తిగా మారాయి. పాఠశాలకు విద్యుత్తు బకాయిలు ఉండడంతో సరఫరాను నిలిపివేశారు. ఈ విషయంపై మండల విద్యాధికారి భీమయ్యను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా విద్యుత్తు అధికారులతో మాట్లాడి సరఫరా కొనసాగేలా చూస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

బాధితులకు సత్వర న్యాయం అందించాలి



సమావేశంలో విప్ లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పరిష్కరించాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధ్యక్షతన జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న విప్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దళితులకు సకాలంలో న్యాయం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ జరపాలని పేద కుటుంబాల వారికి అన్యాయం జరగకుండా చూడాలన్నారు. కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించాలన్నారు. రాయికల్ మండలం కోయగూడెం గ్రామంలో ఆదివాసీలకు విద్యుత్తు సౌకర్యం కల్పించే విషయమై వెంటనే నివేదిక సమర్పించాలని ఆర్డీవోను ఆదేశించారు. జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, అదనపు కలెక్టర్ పి.గౌతంరెడ్డి, జగిత్యాల ఆర్డీవో పి.మధుసూదన్, జగిత్యాల, మెట్‌పల్లి డీఎస్పీలు రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, జిల్లా ఎస్సీ, బీసీ అభివృద్ధి అధికారులు కె.రాజ్‌కుమార్, ఎల్.సాయిబాబా పాల్గొన్నారు.

క్రిమినల్ కేసుల్లో దర్యాప్తు కీలకం

జగిత్యాల, న్యూస్‌టుడే: క్రిమినల్ కేసుల్లో దర్యాప్తు కీలకమని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం పోలీసు డ్యూటీమీట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయం జరగాలంటే సరైన ఆధారాలు కావాలని సాంకేతిక పరిజ్ఞానం, కేసుల దర్యాప్తులో మెలకువలు నేర్చుకునేందుకు డ్యూటీమీట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నైపుణ్యాల ప్రదర్శన, ఆలోచనల మార్పిడికి వేదికగా వినియోగించుకోవాలని జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన వారికి రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. అధికారుల ప్రోత్సాహం అన్ని విధాలా ఉంటుందని సంక్లిష్టమైన కేసుల పరిష్కారానికి దోహదపడే విధంగా ప్రతిభ చాటాలని ఎస్పీ అన్నారు. ఈ సందర్భంగా కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబు డిస్పోజల్, పోలీసు జాగిలాల ట్రాకింగ్ తదితర అంశాలపై ప్రదర్శనలు జరిపారు. అదనపు ఎస్పీ భీంరావు, డీఎస్పీలు రవీంద్రకుమార్, రంగారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, రఫిక్‌ఖాన్, లక్ష్మీనారాయణ, రాంనర్సింహారెడ్డి, నీలం రవి, సురేష్‌బాబు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.



జాగిలాలను పరిశీలిస్తున్న ఎస్పీ తదితరులు

కట్టుదిట్టంగా లడ్డూ ప్రసాదం

- తితిదే ఘటనతో దేవాదాయశాఖ అప్రమత్తం
- ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పర్యవేక్షణ



ధర్మపురి దేవస్థానం లడ్డూ ప్రసాదం

న్యూస్‌టుడే, ధర్మపురి, వేములవాడ, మల్యాల

ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రాలైన వేములవాడ, కొండగట్టు, ధర్మపురి దేవస్థానాల లడ్డూ, పులిహోర ప్రసాదాలను భక్తులు పరమ పవిత్రంగా భావించి కొనుగోలు చేస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో గతంలో లడ్డూ తయారీలో తప్పిదం జరిగిందని ఆరోపణలు రావడంతో రాష్ట్ర దేవాదాయశాఖ అప్రమత్తమైంది.. ప్రధాన ఆలయాల్లో దిట్టం ఉత్తర్వులను తూచా తప్పకుండా పాటించాలని కమిషనర్ ఆదేశాలిచ్చారు.. రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో విజయ తెలంగాణ డెయిరీ నెయ్యిని మాత్రమే వినియోగించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

ధర్మపురిలో రోజుకు 2 వేల విక్రయం

ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం లడ్డూ ప్రత్యేకంగా నిలుస్తోంది. 80 గ్రాముల లడ్డూ ప్రసాదానికి రూ.20, 200 గ్రాముల పులిహోర ప్రసాదానికి రూ.15 తీసుకుంటున్నారు. ప్రతిరోజు సరాసరి 2 వేలలు, శని, ఆదివారాలు 3 నుంచి 5 వేల వరకు లడ్డూ ప్రసాదాలు విక్రయిస్తారు. దిట్టం సామగ్రిని ఉప ప్రధాన అర్చకుడు, సంబంధిత స్టోర్ ఇన్‌ఛార్జి, ఈవో ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తున్నారు. 10 కిలోల లడ్డూ ప్రసాదానికి 7 కిలోల నెయ్యి, 20 కిలోల చక్కెర, కాజు 700 గ్రాములు, కిస్‌మిస్‌లు 750 గ్రాములు, యాలకులు 100 గ్రాములు, కర్పూరం 10 గ్రాములు, జాజికాయ 10 గ్రాములు, మిస్రీ 500 గ్రాములు వినియోగిస్తున్నామని అధికారులు చెప్పారు. 2023 - 24 సంవత్సరానికి లడ్డూ ప్రసాదం ద్వారా రూ.1,50,20,00, పులిహోర ప్రసాదం ద్వారా రూ.54,69,750 ఆదాయం సమకూరింది. ఈవో సంకటాల శ్రీనివాస్ మాట్లాడుతూ ధర్మపురి దేవస్థానంలో లడ్డూ ప్రసాదాల విషయంలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నామని, ప్రస్తుతం కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రాజన్న ఆలయానికి రూ.20 కోట్ల ఆదాయం



వేములవాడ లడ్డూ తయారీలో మహిళా కార్మికులు

వేములవాడ రాజన్నను దర్శించుకున్న భక్తులు ప్రత్యేకంగా స్వామివారి ప్రసాదం లడ్డూలను మహా ప్రసాదంగా భావించి కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. లడ్డూల తయారీని ఒక ఏఈవో, పర్యవేక్షకుడు, సిబ్బంది తనిఖీ చేస్తారు. భక్తుల రద్దీ అంచనాతో లడ్డూలను తయారు చేస్తుంటారు. దాదాపు ప్రతి నెల 10 నుంచి 15 వేల కిలోల నెయ్యిని లడ్డూల తయారీకి వినియోగిస్తుంటారు. ఆలయానికి ఏడాదికి రూ.20 కోట్ల ఆదాయం లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా సమకూరుతోంది. కిలో లడ్డూ తయారీకి 650 గ్రాముల నెయ్యి వినియోగించాల్సి ఉంటుంది. ఆలయానికి సరఫరా అయ్యే నెయ్యికి ఆరు నెలల కాలపరిమితి మాత్రమే ఉంటుంది. అందుకు అనుగుణంగానే నాణ్యమైన నెయ్యిని లడ్డూల తయారీలో వినియోగిస్తున్నామని ఏఈవో శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల అనిశా అధికారుల తనిఖీ సమయంలో తూనికలు, నాణ్యత ప్రమాణాల అధికారులు నెయ్యి నమూనా కూడా తీసుకెళ్లారని చెప్పారు.



కొండగట్టులో లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్న దృశ్యం

కొండగట్టులో ఏటా 50 వేల కిలోల నెయ్యి వినియోగం

కొండగట్టు అంజన్న ఆలయానికి వచ్చే భక్తులు లడ్డూతో పాటు పులిహోర ప్రసాదం కొనుగోలు చేస్తుంటారు. శని, మంగళవారాల్లో దాదాపు 15 వేల లడ్డూలు, 5 క్వింటాళ్ల పులిహోర తయారు చేసి విక్రయిస్తుంటారు. 100 గ్రాముల లడ్డూ రూ.25కు, 200 గ్రాముల పులిహోర రూ.20లకు విక్రయిస్తుంటారు. ప్రతి సంవత్సరం దాదాపు 25 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయిస్తున్నా.. పులిహోర తయారీకి ఖర్చు తక్కువ కావడంతో 75 శాతం లాభం ఈ ప్రసాదం ద్వారానే సమకూరుతుందని అధికారులు చెప్పారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై వివాదం నేపథ్యంలో కొండగట్టు అంజన్న ఆలయానికి సరఫరా చేస్తున్న నెయ్యిని కూడా పరీక్షలు చేయిస్తామని ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. లడ్డూ తయారీకి ప్రతి నెలా 4 వేల కిలోల చొప్పున, ఏడాదికి 50 వేల కిలోల వరకు నెయ్యిని ఖరీదు చేస్తున్నట్లు చెప్పారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

జగిత్యాల, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. బుధవారం జగిత్యాలలో స్వచ్ఛతాహీ సేవా ర్యాలీని ప్రారంభించారు. పురాతన పాఠశాల నుంచి తహసీల్ చౌరస్తా వరకు ర్యాలీ జరగ్గా పాతబస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 15 రోజులపాటు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను రహదారులపై వేయడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని జ్వరాలు ప్రబలుతున్నాయని కలెక్టర్ అన్నారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రాంకుమార్, ఆర్డీవో పి.మధుసూదన్, డీఆర్డీవో ఎం.రఘువరన్, సంక్షేమాధికారి డాక్టర్ నరేష్, జిల్లా ఎఫ్ఎల్‌సీ కోట మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా పాఠశాలల క్రీడా పోటీలు

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని శ్రీవివేకానంద మినీస్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల జిల్లా స్థాయి క్రీడాపోటీలు బుధవారం హోరాహోరీగా సాగాయి. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో జట్ల క్రీడాకారులు పైచేయి సాధించేందుకు ఉత్సాహంగా తలపడ్డారు. రెండో రోజు పోటీలను ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే ఎం.సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులకు ఉచిత భోజన సదుపాయం కల్పించారు. 17 ఏళ్ల లోపు బాలుర విభాగంలో వాలీబాల్ పోటీల్లో విజేతగా వెల్గటూర్, రెండో స్థానంలో సారంగాపూర్, ఖోఖో విజేతగా కోరుట్ల, రెండో స్థానంలో మేడిపల్లి, కబడ్డీలో విజేతగా కోరుట్ల, రెండో స్థానంలో జగిత్యాల అర్బన్ జట్లు నిలిచాయని జిల్లా విద్యాధికారి బి.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పురపాలక అధ్యక్షురాలు అడువాల జ్యోతి, పెటా జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.లక్ష్మీరామ్‌నాయక్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



కబడ్డీలో తలపడుతున్న పెగడపల్లి, బీర్‌పూర్ జట్లు

మెరుగైన వైద్య సేవలు అందించాలి

జగిత్యాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రి, మాతాశిశు కేంద్రాన్ని తనిఖీ చేశారు. అన్ని వార్డులు తిరిగి రోగులతో మాట్లాడారు. అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల పరిస్థితి అధ్వానంగా ఉందని వైద్యులు సమయానికి రావడం లేదన్నారు. భారాస నియమించిన త్రిసభ్య కమిటీలో సభ్యుడినైన తాను ఆసుపత్రుల తనిఖీలు నిర్వహించి రోగుల సమస్యలు తెలుసుకొని ప్రభుత్వానికి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి నివేదిక అందించనున్నట్లు పేర్కొన్నారు.



జిల్లా ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మిషన్ 1000

● రోడ్డు భద్రతపై అవగాహన ● నేటితో ముగింపు


వాహనదారుడికి సూపర్ హీరో కార్డు అందజేస్తున్న దృశ్యం

న్యూస్‌టుడే, కరీంనగర్ రవాణా విభాగం

రహదారి నిబంధనలపై సరైన అవగాహన లేకపోవడం ప్రమాదాలకు దారితీస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో 'ఇండియన్ యూత్ సెక్యూర్డ్ ఆర్గనైజేషన్, సాఫేర్ ఇండియన్ సంస్థ' ఆధ్వర్యంలో 'బీసేఫ్.. డ్రైవ్ సేఫ్.. రీచ్ సేఫ్..' నినాదంతో వెయ్యి రోజులపాటు రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించే కార్యక్రమానికి జనవరి 1, 2022న శ్రీకారం చుట్టగా ఈ నెల 26తో ఈ కార్యక్రమం ముగియనుంది.

రోజూ కార్యక్రమాలు

- కరీంనగర్‌లో బస్టాండ్ చౌరస్తాలో వాహనదారులకు ప్రతిరోజు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు.
- నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపడం, సురక్షిత ప్రయాణానికి ఎలా డ్రైవింగ్ చేయాలి, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, లైసెన్స్ ప్రాముఖ్యం తదితర అంశాలను వివరించారు.
- హెల్మెట్, సీటుబెల్టు పెట్టుకున్న వారికి పూలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.
- సూపర్ హీరో పేరుతో ముద్రించిన కార్డు, బహుమతులు అందజేశారు.
- రహదారి నిబంధనలు, సిగ్నల్స్, వాటి ఉపయోగం, యూటర్న్, వేగం, హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోకుంటే జరిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.
- మైనర్లు వాహనాలు నడపడం వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు.
- ఆటో చోదకులకు యూనిఫాంలు కూడా అందజేశారు.
- విద్యార్థి స్థాయి నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు.

ప్రధాన లక్ష్యాలు ఇవే..

- ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి.
- మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. నడిపితే జరిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి.
- రహదారి నిబంధనలు, సిగ్నల్స్ వ్యవస్థ, ఇతర అంశాలపై అవగాహన లేని వారికి లైసెన్స్‌లు జారీ చేయకూడదు.
- ట్రామాకేర్ సెంటర్లు అందుబాటులో ఉండాలి.
- రహదారి భద్రతపై రోడ్డు సేఫ్టీ కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టాలి.
- రోడ్డు సైన్స్‌ను పాఠ్యాంశంగా చేర్చాలి.

ప్రమాద రహిత ప్రయాణమే ధ్యేయం

సంస్థ వెయ్యి రోజుల కార్యక్రమంలో చాలా మందికి రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన లేదని గుర్తించాం. రహదారి నియమావళిపై కశ్మీర్‌లోనూ ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించాం. భవిష్యత్తులో సంస్థ పక్షాన మరిన్ని కార్యక్రమాలు చేపడుతాం. ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యంగా ముందుకు సాగుతాం.

- ఘన శ్యామ్ ఓజా, సంస్థ అధ్యక్షుడు



హత్య కేసులో ఇద్దరికి జైలు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: హత్య కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత బుధవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ముస్తాబాద్ గ్రామానికి చెందిన పండుగ రాజంకు, తన అక్క మరియమ్మతో ఆస్తుల పంపకంపై గొడవలు జరిగాయి. ఈక్రమంలో 2020 సెప్టెంబరు 1న పండుగ మరియమ్మ, ఆమె కుమారుడు పండుగ మల్లేశంలు పండుగ రాజంను గొడ్డలితో నరికి చంపారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. కోర్టులో నేరం రుజువు కావడంతో మరియమ్మకు పది సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.2,500 జరిమానా, మల్లేశంకు జీవిత ఖైదుతోపాటు రూ.2,500 జరిమానాను ప్రధాన న్యాయమూర్తి విధించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

గుడారం ఏర్పాటు చేస్తున్న స్కౌట్స్ విద్యార్థినులు



సామాజిక స్పృహ, క్రమశిక్షణకు ప్రాధాన్యం

శిక్షణ శిబిరం.. విద్యార్థులకు ఉపయోగం

న్యూస్‌టుడే, జ్యోతినగర్(మార్కండేయకాలనీ)

విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక స్పృహ పెంపునకు స్కౌట్స్ అండ్ గైడ్స్ వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. పాఠశాల దశలోనే వారిలో క్రమశిక్షణ, వ్యక్తిత్వ, శారీరక వికాసానికి కృషి చేస్తోంది. క్షేత్రస్థాయిలో వివిధ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ చిన్నారులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని స్కౌట్స్ యూనిట్‌లో ఉన్న విద్యార్థులకు గోదావరిఖని శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో అయిదు రోజుల పాటు తృతీయ సోపాన్ శిబిరంలో శిక్షణిస్తున్నారు. విద్యార్థులు చురుగ్గా పాల్గొని వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. వారి అభిప్రాయాలు, లక్ష్యాలతో 'న్యూస్‌టుడే' కథనం.

18 పాఠశాలల్లోనే అమలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 450పైనే ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ తప్పనిసరిగా అమలు చేయాలనే విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చింది. స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌లు అన్ని ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేయాల్సి ఉండగా.. కేవలం 18 పాఠశాలల్లోనే అమలవుతోంది. ఈ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడితేనే ఉమ్మడి జిల్లాలో అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.

రాష్ట్రపతి అవార్డు పొందాలనుంది



స్కౌట్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రపతి అవార్డు పొందాలనుంది. గత రెండు సంవత్సరాలుగా శిక్షణ పొందుతున్నా. ప్రస్తుతం శిక్షణ శిబిరంలో టెంటు కట్టడం, మార్చ్ ఫస్ట్, శ్రమదానం కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నా. శిక్షకుల మార్గదర్శకంలో రాజ్యపురస్కార్ శిక్షణ శిబిరంలో పాల్గొనే దిశగా కసరత్తు మొదలుపెడుతున్నా. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తృతీయ సోపాన్‌లో మంచి ప్రతిభ కనబరిచాను.

విశ్వశ్రీ, 8వ తరగతి, కరీంనగర్

పాత్రలు లేకుండా వంట చేశాం



స్కౌట్స్ ద్వారా ఇతరులకు సేవ చేయడం, పెద్దలను గౌరవించడం, వృద్ధులను చేరదీయడం తదితర లక్షణాలు అలవడ్డాయి. శిక్షణ శిబిరంలో అటవీ ప్రాంతాల్లో తప్పిపోతే ఏం చేయాలో నేర్పుతారు. తృతీయ సోపాన్ శిబిరంలో శిక్షకులు మొదట పాత్రలు ఇవ్వకుండా కూరలు వండాలని సూచించారు. దీంతో ఇటుక, మట్టి, కట్టెల మంటతో వంట చేశాం.

రక్షిత, 9వ తరగతి, సుల్తానాబాద్, కేజీబీవీ

గైడ్ కెప్టెన్ కావడమే లక్ష్యం



స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరి తృతీయ సోపానాలను పూర్తి చేసుకున్నా. రాష్ట్రపతి క్యాంపులో పాల్గొని అవార్డు అందుకోవాలన్నదే నా కోరిక. శిక్షణలో సమాజంలోని ప్రతి అంశాన్ని తెలుసుకోగలుగుతాం. స్కౌట్స్ గైడ్ కెప్టెన్ అవ్వడమే లక్ష్యం.

వర్షిణి, 7వ తరగతి, గోదావరిఖని

క్రమశిక్షణకు మారుపేరు



స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, మంచి నడవడిక కలిగి ఉంటారు. ఇతర భాషలు, ఆచార కట్టుబాట్లు, సంస్కృతులపై అవగాహన ఉంటుంది. సమకాలీన అంశాలు తెలుసుకుంటారు. ప్రతిభ కనబరిస్తే రాష్ట్రపతి, గవర్నర్‌ల నుంచి అవార్డు పొందే సువర్ణ అవకాశం లభిస్తుంది.

సూర్యదేవర జ్యోతి, జిల్లా గైడ్ కమిషనర్

పలుకుల చిలుక.. అదిరింది నీ ఆవాసం



తాటి కల్లుకు ఉపయోగపడని చెట్లను రామచిలుకలు తమ నివాసంగా మార్చుకున్నాయి. మానకొండూర్ పరిధి చెంజర్ల సమీపంలోని జాతీయ రహదారి వెంబడి రేణుక ఎల్లమ్మ ఆలయం ఎదుట ఉన్న తాటి చెట్లకు.. కొన్ని చిలుకలు రంధ్రాలు చేసుకొని ఉంటున్నాయి. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు వీటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

- న్యూస్‌టుడే, మానకొండూర్

నీ బిడ్డ నీలగౌరి.. నిత్య మల్లె చెట్టేసి!



'బొడ్డెమ్మ.. బొడ్డెమ్మా.. కోల్' అంటూ సాగే పాటలతో మంథని పట్టణంలో వాడవాడలా వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అయిదు రోజులుగా మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ వస్త్ర ధారణతో భక్తిశ్రద్ధలతో బొడ్డెమ్మను పూజిస్తున్నారు. చెరువు మట్టితో బొడ్డెమ్మను తయారు చేసి, ప్రత్యేక వేదికపై ఉంచి ధూప దీప నైవేద్యాలు నివేదిస్తున్నారు. బొడ్డెమ్మ చుట్టూ ఆడిపాడుతున్నారు. -న్యూస్‌టుడే, మంథని గ్రామీణం

అధిక సాంద్రతపై అన్నదాతల ఆశలు

న్యూస్‌టుడే, హుజూరాబాద్

పత్తి దిగుబడులపై శాస్త్రవేత్తల భరోసా

ప్రస్తుత సీజన్‌లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుచేసిన రైతులు దిగుబడులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గతేడాది వానాకాలం సీజన్‌లో ఇదే పద్ధతిలో ప్రయోగాత్మకంగా సాగు చేసినా ఆశించిన ఫలితం రాలేదు. దిగుబడులు ఎక్కువ వస్తాయని వ్యవసాయాధికారులు ప్రోత్సహించినా.. తీరా పంట చేతికొచ్చేసరికి నిరాశే ఎదురైంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి సాగులో మెలకువలు పాటించి దిగుబడులు పెరిగేలా.. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలు రైతులకు భరోసా కల్పిస్తున్నారు.

గతేడాది నామమాత్రంగానే..

జిల్లాలో గతేడాది 195 ఎకరాల్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేశారు. ఈ విధానంలో సాగు చేయడం ద్వారా ఎకరాకు 12-14 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు ప్రోత్సహించడంతో రైతులు ముందుకొచ్చారు. తీరా పత్తి చేతికి వచ్చేసరికి ఎకరాకు అయిదు నుంచి ఏడు క్వింటాళ్లకు మించి దిగుబడులు రాలేదు. ఒక్క సైదాపూర్ మండలంలోనే 25 మంది రైతులు 36 ఎకరాలు సాగు చేయగా అందరికి 5-7 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. అయితే గతేడాది అధిక వర్షాలు, వాతావరణ అనుకూలించక పోవడంతో ఆశించిన దిగుబడులు రాలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

అందని ఆర్థిక ప్రోత్సాహం

సాధారణ సాగుతో పోలిస్తే అధిక సాంద్రత సాగులో పెట్టుబడి ఎక్కువ. అందుకే ఆర్థిక ప్రోత్సాహం కింద అదనపు పెట్టుబడిని ఎంపిక చేసిన రైతులకు ఇచ్చేలా ప్రభుత్వం ప్రకటించింది. ఈ విధానంలో ఒక్కో రైతుకు ఎకరాకు రూ.3,400 నుంచి రూ.4,980 చొప్పున చెల్లించేలా వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. కానీ ఏడాది దాటినా నేటికీ అందకపోవడం రైతులను నిరాశకు గురిచేసింది. రైతుల బ్యాంకు ఖాతా, ఆధార్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని.. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.


సైదాపూర్‌లో అధిక సాంద్రత పద్ధతిలో సాగుచేసిన పత్తి

469 ఎకరాల్లో సాగు..



ప్రస్తుత వానాకాలం సీజన్‌లో అధిక సాంద్రత విధానంలో 524 ఎకరాల్లో సాగు చేసేలా జాతీయ పత్తి పరిశోధన సంస్థ లక్ష్యాన్ని నిర్దేశించింది. గ్రామాలు, రైతుల ఎంపిక, సాగు బాధ్యతను ఈసారి జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్తలకు అప్పగించింది. జిల్లాలోని 44 గ్రామాల్లో మొత్తం 10 విభాగాల్లో ఎంపిక చేసిన వివిధ కంపెనీల విత్తనాలతో అధిక సాంద్రత విధానంలో 315 ఎకరాలు, మధ్యస్థ సాంద్రత పద్ధతిలో 154 ఎకరాల్లో సాగు చేశారు. మొత్తంగా 469 ఎకరాల్లో పత్తి సాగయ్యేలా రైతులను ప్రోత్సహించారు.

మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు

రైతులు సాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవడంతో పాటు సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలి. ఈసారి ఎకరా పత్తికి 11-14 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. భవిష్యత్తులో సాగు విస్తీర్ణం పెంచాలని జాతీయ పత్తి పరిశోధన సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.


- డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, శాస్త్రవేత్త, కేవీకే, జమ్మికుంట

పెరుగుతున్న పత్తి విక్రయాలు

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి విక్రయాలు క్రమంగా పెరుగుతున్నాయి. యార్డుకు బుధవారం 30 ట్రాలీల కొత్త విడిపత్తి, 11 ట్రాలీల పాత విడిపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్ కొత్త విడిపత్తి రూ.6,000 నుంచి రూ.6,850 దాకా.. పాత విడిపత్తి రూ.7,000 నుంచి రూ.7,600 వరకు ధర పలికింది. 75 క్వింటాళ్ల బస్తాల కొత్త పత్తి విక్రయానికి రాగా రూ.6,000 నుంచి రూ.6,800 వరకు వ్యాపారులు ధర నిర్ణయించారు. కొత్త విడిపత్తి మంగళవారం కంటే తాజాగా రూ.211లు తగ్గినట్లు మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం తెలిపారు. కొత్తపత్తి అధిక తేమతో ఉండటంతోనే ధర పడిపోయిందని చెప్పారు.

30న ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ కొత్తపల్లి, న్యూస్‌టుడే: కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 30న ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్స్ బాలుర, బాలికల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేణి లక్ష్మణ్‌లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రాలతో ఉదయం 10 గంటలకు సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రభాకర్, కోచ్ వెంకటేశ్‌లకు రిపోర్టు చేయాలని సూచించారు.


మాట్లాడుతున్న టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్

అన్ని దేవాలయాలకు పీఆర్‌సీ అమలు చేయాలి

వేములవాడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు పీఆర్‌సీ అమలు చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం వేములవాడ పట్టణంలో యాదగిరిగుట్ట, వేములవాడ, భద్రాచలం, కొమురవెల్లి, కొండగట్టు, బాసర దేవాలయాల ఉద్యోగుల ఐకాస సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజవెల్లి రమేశ్‌బాబు అధ్యక్షతన జరిగింది. దీనికి జగదీశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెద్ద దేవాలయాలకు పీఆర్‌సీ అమలు చేసి చిన్న దేవాలయాలకు చేయలేదని పేర్కొన్నారు. 261 జీవో సవరణ చేసి ఉద్యోగులందరికీ ఒకే రకమైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దేవాలయాల్లో భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా అందుకు అనుగుణంగా ఉద్యోగుల సంఖ్యను పెంచాలన్నారు. ఆలయాల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వం ఉన్నా తమ సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ఆ ప్రభుత్వంపై ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మిర్యాల నాగేందర్‌రెడ్డి, పరమేశ్వర్, వేముల ప్రభాకర్, బుద్ధి శ్రీనివాస్, గౌరవ సలహాదారులు దయాకర్‌రెడ్డి, భాస్కర్, సాయి, హరికిషన్, కృష్ణ, ఉమేశ్‌శర్మ, నర్సయ్య, శ్రీరాములు, వెంకటాచార్యులు కపీంద్రాచారి, మదన్‌కుమార్, అర్చకులు, వివిధ ఆలయాల ఉద్యోగులు పాల్గొన్నారు. అంతకు ముందు వారు రాజన్నను దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి ప్రసాదం అందజేశారు.

శ్రీరామసాగర్‌కు స్థిరంగా వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం వరకు 33,238 క్యూసెక్కుల చొప్పున వరదనీరు వచ్చిచేరుతోంది. ప్రాజెక్టు నుంచి వరదకాలువకు నీటివిడుదలను 18 వేల క్యూసెక్కులకు పెంచి మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. 2 స్పిల్‌వే గేట్లద్వారా 6,248 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్లద్వారా 1,200 క్యూసెక్కుల మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీరు నిలువుంది.

మధ్యమానేరుకు..

బోయినపల్లి : రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయానికి వరద కొనసాగుతుంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 9,259 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 25.22 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ప్రమాదాల కట్టడికి చర్యలు

● ఆర్టీసీలో నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు


జగిత్యాల డిపోలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది

న్యూస్‌టుడే, జగిత్యాల విద్యానగర్

ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఆర్టీసీ సంస్థ డ్రైవర్లు, కండక్టర్లకు నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తోంది. కొందరు మద్యం తాగి బస్సులు నడుపుతున్న ఘటనలు దృష్టికి రావడంతో పరీక్షలు నిర్వహించడం తప్పనిసరి చేసింది. డ్రైవర్లు, కండక్టర్లను పరీక్షించిన తరువాతనే విధుల్లోకి తీసుకొని బస్సులను అప్పగించే విధానం అమలు చేస్తున్నారు. కరీంనగర్ జోన్‌లోని మొత్తం 39 డిపోల్లో కలిపి ఆర్టీసీ బస్సులు 2242, ప్రైవేటు 1347 మొత్తం కలిపి 3589 బస్సులు ఉన్నాయి. ఇవి రోజుకు సగటును 15.94 లక్షల మంది ప్రయాణికులను గమ్యానికి చేరవేస్తున్నాయి. ఒక బస్సు అంటే 60 కుటుంబాలనే భావనతో ప్రయాణికులను క్షేమంగా ఇంటికి చేర్చడమే లక్ష్యంగా ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

రెండేళ్లలో 255 కేసులు

మద్యం తాగి విధులకు హాజరవుతున్న తీరుపై ఆర్టీసీ సంస్థ కఠినంగా వ్యవహరించడం సత్ఫలితాలు ఇస్తోంది. విజిలెన్స్ విభాగం ద్వారా పటిష్ఠ నిఘా అమలు చేయడంతో క్రమంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు తగ్గుతున్నాయి. ప్రతి డిపో వద్ద మొదట బస్సు బయలుదేరే సమయంలో, ఆ తరువాత మధ్యలో ఎక్కడా మద్యం తాగినా గుర్తించే విధంగా ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఇలా సగటున రోజుకు 80 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. గతేడాది 39 డిపోల్లో కలిపి ఆర్టీసీ సంస్థకు సంబంధించి 52 కేసులు నమోదు కాగా అద్దె బస్సులకు చెందినవి 94, మొత్తం కలిపి 146 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఆర్టీసీలో 57, అద్దె బస్సులకు సంబంధించి 52, మొత్తం కలిపి 102 కేసులు నమోదు చేశారు.

విధుల నుంచి తొలగింపు

మద్యం తాగి బస్సులు నడపకుండా పరీక్షలు నిర్వహించడంతోనే సరిపెట్టకుండా మరోసారి పునరావృతం కాకుండా ఆర్టీసీ కఠిన చర్యలకు ఉపక్రమించింది. పరీక్షల ఫలితాలు తదితరాలపై విచారణ జరిపి సిబ్బందిని ఉద్యోగం నుంచి తొలగించేందుకు వెనుకాడటం లేదు. జగిత్యాల డిపో పరిధిలో ఇప్పటి వరకు 17 కేసులు నమోదయ్యాయి. వీటిలో ఆర్టీసీకి చెందిన ఆరుగురు డ్రైవర్లు, ఒక కండక్టర్, మరో ఇద్దరు మెకానిక్‌లు, అద్దె బస్సులకు చెందిన నలుగురు డ్రైవర్లు, ఇద్దరు కండక్టర్లు, ఇద్దరు మెకానిక్‌లు మద్యం తాగి విధులకు హాజరైనట్లు గుర్తించారు. వీరిలో పలువురిని విధుల నుంచి తొలగించగా తక్కిన కేసులు విచారణలో ఉన్నాయి.

సిబ్బంది సంక్షేమానికి శ్రీకారం

సంస్థ సిబ్బంది సంక్షేమానికి ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. తాజా గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ పేరిట కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా అన్ని రకాల వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తోంది. ప్రధానంగా గుండెకు సంబంధించిన టుడీఎకో, నేత్ర పరీక్షలు, ఛాతి తదితర పరీక్షలు చేయించి సిబ్బంది ఆరోగ్యం విషయంలోనూ ప్రత్యేక దృష్టి సారించింది. బస్సుల సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగాల భర్తీ లేనందున తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

ప్రయాణికుల భద్రతే అత్యంత ప్రాధాన్యంగా సంస్థ అన్ని విధాలా కృషి చేస్తోంది. ఇందులో బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు ఒక భాగం. ఆర్టీసీ లక్ష్యాలు, ప్రాథమ్యాలు, నిబంధనలు ఆకలింపు చేసుకొని సిబ్బంది సంస్థ అభివృద్ధికి తమవంతుగా సహకరిస్తున్నారు. భవిష్యత్తులోనూ జగిత్యాల డిపోను మునుపటిలా మొదటి స్థానంలో ఉంచేందుకు కృషి చేస్తాం.

- సునీత, డీఎం, జగిత్యాల

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)
జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

? ఇళ్లమధ్యన ఖాళీస్థలాల్లో నీరు నిలవటం, చెట్లు పెరగటం, దోమలవ్యాప్తితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.
- రాజశేఖర్, గణేశ్‌నగర్

✓ సిబ్బందితో పరిశీలింపచేసి పారిశుద్ధ్యం, ఫాగింగ్ తదితరాలను చేపడతాము. - సమ్మయ్య, పురపాలక కమిషనర్, జగిత్యాల
- న్యూస్‌టుడే, జగిత్యాల వాణిజ్యం

కొండగట్టులో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు ఆలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేసిన కె.శ్రీనివాసాచారి నిధుల దుర్వినియోగానికి పాల్పడి ఆరు నెలల కిందట సస్పెండైన విషయం తెలిసిందే. శ్రీనివాసాచారి ఆలయ పరిధిలో లీజు వ్యాపారుల నుంచి రూ.37.90 లక్షల వసూలు చేసి వాటిని దేవస్థానం ఖాతాలో జమచేయకుండా దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించిన అధికారులు అతడిని ఫిబ్రవరి 29న సస్పెండు చేయడంతోపాటు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు. దేవాదాయశాఖ అధికారులు రికార్డులు పరిశీలించగా శ్రీనివాసచారి మరో రూ.14,49,900 దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. ఈ విషయమై మంగళవారం సాయంత్రం ఈవో రామకృష్ణారావు మల్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో శ్రీనివాసాచారిపై ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో ఈవో ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం దర్యాప్తు కొనసాగుతుందని ఎస్సై నరేష్ తెలిపారు. సస్పెన్షన్ కాలానికి సంబంధించి సగం వేతనం అందజేయడంలేదని శ్రీనివాసచారి కోర్టును ఆశ్రయించినట్లు అధికారులు పేర్కొన్నారు. శ్రీనివాసచారి ఇప్పటి వరకు రికార్డులను ఆలయ అధికారులకు అప్పగించలేదని ఏఈవో అంజయ్య వివరించారు. తాను ఎక్కడా ఎలాంటి ఉద్యోగం చేయడంలేదని స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తేనే సగం వేతనం చెల్లించే వీలుంటుందని పేర్కొన్నారు.

అర్హులకు కొత్త రేషన్ కార్డులు

బుగ్గారం, న్యూస్‌టుడే: అర్హులైన వారందరికి త్వరలోనే కొత్త రేషన్ కార్డులను అందించి సన్నబియ్యం పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. బుగ్గారం ఎంపీడీవో కార్యాలయంలో 28 మంది లబ్ధిదారులకు రూ.29 లక్షల విలువ గల కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం విప్ పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుగ్గారం మండల కేంద్రంలో త్వరలోనే ప్రభుత్వ భవనాల నిర్మాణాలు పూర్తి చేస్తామని చెప్పారు. రుణమాఫీ కాని రైతులను గుర్తించి అందే విధంగా చూస్తామని పేర్కొన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే పలు పథకాలు అమలవుతున్నాయని మిగితా వాటిని అమలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాజీద్, ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు దినేష్, సుభాష్, నర్సగౌడ్, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: బతుకమ్మ, దసరా ఉత్సవాలను పట్టణంలో ఘనంగా నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని బుధవారం నిర్వహించిన బల్దియా సాధారణ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగు పరచాలని, శివారు ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, రాయికల్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులతో వచ్చేవారు వంట చేసుకునేందుకు, భోజనం చేసేందుకు అవసరమైన షెడ్డు ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. పుర అధ్యక్షుడు హన్మాండ్లు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, వార్డు కౌన్సిలర్లు, మేనేజర్ వెంకటి, సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వసతులు కల్పించరా?


విద్యార్థినులతో మాట్లాడుతున్న వసంత

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక వసతులు కల్పించలేరా అని జడ్పీ ఛైర్‌పర్సన్ దావ వసంత విమర్శించారు. జగిత్యాల గ్రామీణ మండలం జాబితాపూర్ జిల్లా పరిషత్తు పాఠశాలలో మూత్రశాలలు లేకపోవటంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత బుధవారం పాఠశాలను పరిశీలించారు. తాను పాఠశాలకు రూ.10 లక్షలు మంజూరు చేశానని, ప్రహరీ నిర్మాణం కూడా చేపట్టలేదని విమర్శించారు. చిత్తారి శ్రీనివాస్, పడిగెల గంగారెడ్డి, లక్ష్మన్, బుర్ర ప్రవీణ్‌గౌడ్, చిత్తారి సురేశ్, శేఖర్‌గౌడ్, మహేశ్, సంతోష్, సాగర్, ప్రణయ్, ప్రతాప్, సాయి పాల్గొన్నారు.

సామాజిక తనిఖీతో పారదర్శకత

వెల్గటూరు, న్యూస్‌టుడే: సామాజిక తనిఖీలతో ఉపాధిహామీ పనుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతోందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్ పేర్కొన్నారు. వెల్గటూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 14వ విడత సామాజిక తనిఖీ మండల ప్రజావేదికను ఏర్పాటు చేశారు. ఉమ్మడి మండలంలోని 30 గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.7.33 కోట్ల విలువైన పనులకు సంబంధించిన తనిఖీ జరిగింది. లోపాలకు సంబంధించి ఉపాధిహామీ సిబ్బందికి రూ.5వేలు జరిమానా విధించారు. కూలీలకు రూ.28,952 రికవరీ రూపంలో గుర్తించారు. ప్రిసైడింగ్ అధికారి మదన్మోహన్, అంబుడ్స్‌మన్ కృష్ణారెడ్డి, డీపీవో చిన్నయ్య, ఏపీవో దేవేందర్‌రెడ్డి, ఎస్ఆర్పీ పాండురంగ, ఎంపీడీవోలు విజయలక్ష్మి, సంజీవరావు, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో అనిల్ పాల్గొన్నారు.


పోషకాహార ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ పేర్కొన్నారు. మెట్‌పల్లిలోని అంగన్‌వాడీ 4వ కేంద్రంలో బుధవారం పట్టణ అంగన్‌వాడీ కార్యకర్తలంతా సామూహికంగా పోషణమాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిశోర బాలికలు పోషకాహారంతో రక్తహీనతను అధిగమించవచ్చన్నారు. కార్యక్రమాలను రాష్ట్ర సమన్వయకర్త రహమాన్ పరిశీలించారు. సీడీపీవో మణెమ్మ, సూపర్‌వైజర్ ప్రతిభ, మాదన్న పద్మ, నజీమాబేగం, సుమలత, వనజ, గంగలక్ష్మి తదితరులున్నారు.

కోరుట్ల: కథలాపూర్ మండలం సిరికొండ, దుంపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ రాష్ట్ర అధికారుల బృందం రాహుల్, రవణ్ బుధవారం పరిశీలించారు. కేంద్రాల్లో పౌష్టికాహార నిల్వలు, రికార్డులను పరిశీలించారు. చిన్నారుల బరువులను తూకం వేసి ఎత్తుకు తగిన బరువు లేని పిల్లల స్థితిని గమనించాలని టీచర్లకు సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి నరేశ్, ఈవో పవిత్ర, మధుకుమార్, మణెమ్మ, ప్రశాంత్ పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ జయంతి వేడుకలు

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని భాజపా జిల్లా కార్యాలయంలో ఆర్ఎస్ఎస్ మాజీ అధ్యక్షుడు, దివంగత దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు, అనుమల్ల క్రిష్ణహరి, దివాకర్, సత్యం, రమణ, పెద్ద గంగారాం, ప్రవీణ్, తిరుపతి, శ్రీనివాస్, కాయితి శంకర్, సత్యం, రాజేందర్, మమత, కవిత, రాము తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: కోరుట్ల పట్టణంలో భాజపా ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి బుధవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి భాజపా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, రాజేశం, మహేష్, ధనుంజయ్, గణేష్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో బుధవారం పండిట్ దీన్‌దయాల్ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. భాజపా నాయకులు గాంధీ కూడలి వద్ద ఆయన చిత్రపటాన్ని నిలిపి పూల మాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, నాయకులు భాస్కర్, లక్ష్మణ్, శ్రీనివాస్, సత్యనారాయణ, శ్యాం, మల్లేషం, బాపు పాల్గొన్నారు.


జగిత్యాల: నివాళి అర్పిస్తున్న భాజపా నాయకులు

నేర వార్తలు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

గంజాయి విక్రేత అరెస్టు

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: గంజాయి విక్రయిస్తున్న మెట్‌పల్లి వైఎస్సార్ అర్బన్ కాలనీకి చెందిన చందును అరెస్టు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన వద్ద సుమారు 350 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మెట్‌పల్లి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్‌తో కలిసి సీఐ వివరాలు వెల్లడించారు. ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలోని బండలింగాపూర్ శివారులో 21న అర్ధరాత్రి ఆగి ఉన్న మక్కల లోడ్ వ్యాన్ డ్రైవర్‌పై దాడి చేసి నగదు, చరవాణి చోరీ చేసిన కేసులో ముగ్గురిని పట్టుకున్న సమయంలో వాటితో పాటు 200 గ్రాముల గంజాయిని కూడా స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి ఎవరు విక్రయించారని విచారణ చేపట్టగా వైఎస్సార్ అర్బన్ కాలనీకి చెందిన చందు పేరు వెల్లడించారు. అప్పటినుంచి అతను పరారీలో ఉన్నారు. అతని ఆచూకీ కోసం డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు ఆదేశాల మేరకు సీఐ, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి ఎస్సైలు అనిల్, చిరంజీవి, రాజు గాలింపు చేపట్టగా బుధవారం ఇంటి వద్ద ఉన్నాడన్న సమాచారంతో పట్టుకున్నారు. అతని వద్ద సుమారు 350 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ఎస్సై కొట్టడంతోనే ఆత్మహత్యాయత్నం?

జగిత్యాల: ఎస్సై కొట్టడంతోనే తన అన్న శివప్రసాద్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆయన సోదరి ప్రశాంతి అన్నారు. జగిత్యాల మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన బొల్లారపు శివప్రసాద్ అతని భార్య మధ్య గొడవ జరుగుతుండడంతో 22న కోరుట్ల పోలీసులు పిలిపించారు. రాత్రి ఇంటికి వచ్చిన అతను 23న ఉదయం పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా కాలిన ఆయనను మొదట జగిత్యాల ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆ తర్వాత హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. తన అన్నను కోరుట్ల ఎస్సై పిలిపించి తీవ్రంగా కొట్టడంతో మనస్తాపానికి గురై పెట్రోల్ పోసుకొని నిప్పటించుకున్నాడని ఆమె పేర్కొంది. ఈ విషయమై సీఐ సురేశ్‌బాబును వివరణ కోరగా పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించామని, అతని మానసికస్థితి సరిగా లేదని, మందలించామని, కొట్టలేదని పేర్కొన్నారు.

ఎట్టకేలకు యువకుడి అంత్యక్రియలు పూర్తి

మెట్‌పల్లి: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ ఏనుగు ప్రభాస్ అంత్యక్రియలు బుధవారం నిర్వహించారు. ప్రభాస్ మృతికి తల్లి కారణమని ఆరోపించడమే కాకుండా ఆమె పేరిట ఉన్న ఇళ్లు, వ్యవసాయ భూములు భర్త పేరిట మార్పిడి చేయాలని స్థానికులు మంగళవారం యువకుడి అంత్యక్రియలు ఆపేసిన సంగతి విదితమే. ఉదయం డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు చిరంజీవి, రాజు గ్రామానికి చేరుకుని యువకుడి తండ్రి ప్రతాప్‌తో మాట్లాడి అంత్యక్రియలు పూర్తి చేయాలని నచ్చజెప్పారు. దీంతో మధ్యాహ్నం యువకుడి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువకుడి తండ్రి మాట్లాడుతూ గల్ఫ్ వెళ్లి కష్టపడి పనిచేసి ఇళ్లు నిర్మించుకున్నానని, కుమారుడిని హైదరాబాద్‌లో చదివిస్తున్నానన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగం చేయడం లేదని తల్లి మందలించిందని, ఉద్యోగం చేయడం ఇష్టం లేక పురుగు మందు తాగినట్లు ప్రభాస్ నిజామాబాద్ మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇచ్చారని తెలిపారు. ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా గ్రామంలో పోలీసు బలగాలను మోహరించారు.

ప్రభుత్వ పాఠశాలలో అంగన్‌వాడీ గుడ్లు


అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గుడ్లు

రామన్నపేట, న్యూస్‌టుడే: మల్యాల మండలం రామన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అంగన్‌వాడీ గుడ్లను అందజేయడం వివాదంగా మారింది. పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే ముద్రవేసి ఉన్న 180 గుడ్లు నిల్వ ఉన్నాయి. బుధవారం మధ్యాహ్న భోజనంలో 90 గుడ్లు ఉడికించి విద్యార్థులకు అందించారు. ఈ విషయమై మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు మాధవిని సంప్రదించగా తమకు గుడ్లు సరఫరా చేసే వ్యక్తి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గుడ్లను ఒక్కోదానికి రూ.4 చొప్పున అందజేశారని తెలిపారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయుడు రాజగోవిందరెడ్డిని వివరణ కోరగా మధ్యాహ్న భోజన సమయంలో ఉడికిన గుడ్లను మాత్రమే తాము పరిశీలిస్తామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గుడ్లను పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్నట్లు బుధవారం గుర్తించామని, ఇక ముందు అలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

వయోవృద్ధులకు అండగా నిలవాలి

జగిత్యాల, న్యూస్‌టుడే: వయోవృద్ధులకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. బుధవారం పురాతన ఉన్నత పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల గోడప్రతులను ఆవిష్కరించారు. జిల్లా సంక్షేమాధికారి డాక్టర్ బి.నరేష్, ఆర్డీవో పి.మధుసూదన్, డీపీవో ఎం.రఘువరన్, కమిషనర్ సమ్మయ్య, హరిఅశోక్‌కుమార్, తదితరులున్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


మల్యాల: కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రామన్నపేట, న్యూస్‌టుడే: మల్యాల మండలం రామన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 'రాష్ట్రీయ బాల స్వాస్థ్య'(ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మండలంలోని రామన్నపేట, రాంపూర్, ఓబులాపూర్, నూకపల్లి, గొల్లపల్లె ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 261 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించి వారిలో దృష్టిలోపం ఉన్న 15 మందిని గుర్తించినట్లు ఆప్తాల్మిక్ అధికారి తిరుపతి తెలిపారు. ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్ ఫర్హాన, డాక్టర్ సబస్సుమ్, ఏఎన్ఎం రవళి, ఫార్మాసిస్టు శ్రీలత పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మహేష్ విద్యార్థులకు కంటి, రక్తహీనత వంటి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.వేణు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ తిరుపతి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.


హుండీ డబ్బులు లెక్కిస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ఆలయ సిబ్బంది

ధర్మపురి ఆలయ హుండీ ఆదాయం రూ.47.70 లక్షలు

ధర్మపురి, న్యూస్‌టుడే: ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ డబ్బులు బుధవారం లెక్కించగా.. రూ.47.70 లక్షల ఆదాయం సమకూరింది. 105 రోజుల హుండీలో రూ.47,70,995 నగదుతో పాటు 50 గ్రాముల మిశ్రమ బంగారం, 4.700 కిలోల మిశ్రమ వెండి, 90 విదేశీ నోట్లు ఉన్నాయి. కరీంనగర్ దేవాదాయ శాఖ పరిశీలకులు సుప్రియ, ధర్మపురి ఆలయ ఈఓ శ్రీనివాస్, మాజీ ఉత్సవ కమిటీ సభ్యులు రవీందర్, వర్తక, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, బ్యాంకు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

రాయికల్, న్యూస్‌టుడే: వ్యాధుల బారిన పడిన రోగులకు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. బుధవారం మండలంలోని వడ్డెలింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ, ఐపీ సేవలు, రికార్డులు, హాజరుపట్టిక, మెడికల్ ఫార్మసీని పరిశీలించారు. ఆసుపత్రిలోని వసతులు, అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. జగిత్యాల ఆర్డీవో మధుసుధన్, జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్, తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీడీవో చిరంజీవి, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు ప్రమాదకరం

జగిత్యాల, న్యూస్‌టుడే: పొగాకు ఉత్పత్తులు ప్రమాదకరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎండి.సమియొద్దీన్ అన్నారు. బుధవారం మోతెవాడ పట్టణ ఆరోగ్య కేంద్రంలో టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0 కార్యక్రమం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించి 60 రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎ.శ్రీనివాస్, డాక్టర్ అర్చన, డాక్టర్ ఎం.జైపాల్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ స్వాతి, భూమేశ్వర్, మురళీధర్ పాల్గొన్నారు.

నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు

జగిత్యాల, న్యూస్‌టుడే: నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని మహిళా కళాశాల ప్రిన్సిపల్ కె.రామక్రిష్ణ అన్నారు. బుధవారం టాస్క్ ఆధ్వర్యంలో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకోవాలని ప్రతిఒక్కరూ టాస్క్‌లో నమోదు కావాలన్నారు. గంగాప్రసాద్, కోఆర్డినేటర్ జి.నీరజ, మెంటార్ జి.తిరుపతి, ఎన్.సంగీతారాణి, జి.శ్రీలత, బి.సుజాత పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన


పొలాస పరిశోధనస్థానంలో విద్యార్థులు

జగిత్యాల వ్యవసాయం: జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానాన్ని కరీంనగర్‌లోని పారమిత పాఠశాల విద్యార్థులు బుధవారం సందర్శించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీలత, పి.రవి, బి.శ్రీలక్ష్మి తదితరులు వాతావరణ అధ్యయనం, విత్తనోత్పత్తి, ల్యాబ్‌లో పరిశోధన, సాగులో వాడే యంత్రాలపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కలిగించారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

జగిత్యాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు తమ పిల్లలన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం అభినందనీయమని పాఠశాలల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచి మంచినీటి వసతి కల్పించాలన్నారు. జీవన్‌రెడ్డి, పురపాలక ఛైర్‌పర్సన్ జ్యోతి, కమిషనర్ సమ్మయ్య, ఫ్లోర్ లీడర్ కల్లెపల్లి దుర్గయ్య, కౌన్సిలర్ గుగ్గిల్ల హరీష్ తదితరులున్నారు.

పాఠశాలలో వసతులు కల్పించాలని కలెక్టర్‌కు లేఖ

జగిత్యాల గ్రామీణం: జగిత్యాల గ్రామీణ మండలం జాబితాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు బుధవారం లేఖ రాశారు. మూత్రశాలలు నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని కోరారు.

అంకితభావంతో పనిచేయాలి


ఎస్పీ అశోక్‌కుమార్‌తో శిక్షణ ఎస్సైలు

జగిత్యాల, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లాకు నలుగురు శిక్షణ ఎస్సైలను కేటాయించగా బుధవారం మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరైన పోలీసుశాఖలో ఉద్యోగాలు పొందడం అభినందనీయమని క్రమశిక్షణతో మెలిగి జిల్లాకు, పోలీసుశాఖకు మంచి పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణ ఎస్సైలు ఎం.సుప్రియ, జి.సతీష్, సబ్బని రాజు, ఎం.రవీంద్రకుమార్‌కు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాల్లో పంపు ఆపరేటర్ల పాత్ర కీలకం

కొడిమ్యాల, న్యూస్‌టుడే: గ్రామాల్లో మంచినీటి సరఫరాలో పంపు ఆపరేటర్ల పాత్ర కీలకమని జిల్లా అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి అన్నారు. బుధవారం కొడిమ్యాల మండల పరిషత్తు కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో జరుగుతున్న కొడిమ్యాల, మల్యాల మండలాల మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ అమరేందర్, ఎంపీడీవో స్వరూప, ఎంపీవో వాసవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు మణిదీప్, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి మండలంలోని శ్రీరాములపల్లె గ్రామపంచాయతీ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థికి సన్మానం

కొడిమ్యాల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎర్రోజు తక్షిల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.వేణు, అధ్యాపకులు బుధవారం సన్మానించారు. ఇటీవల ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు అధ్యాపకులు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు బండ్ల భాస్కర్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో వసతుల కల్పనకు కృషి

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: జగిత్యాలలోని ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన తరగతి గదుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. కళాశాల సీనియర్ విద్యార్థులు జూనియర్లకు స్వాగతోత్సవాన్ని బుధవారం నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ దాసరి నాగభూషణం, బాలికల కళాశాల ప్రిన్సిపల్ అలియా, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి పట్టణం: క్రమశిక్షణ గల ప్రతి విద్యార్థి జీవితంలో అనుకున్నది సాధించి ఉన్నత స్థానంలో నిలుస్తారని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులకు ద్వితీయ సంవత్సర విద్యార్థులు స్వాగతోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

సంక్షిప్తం

స్వచ్ఛతపై చిత్రలేఖన పోటీలు

కోరుట్ల: కోరుట్ల పట్టణం కల్లూర్‌రోడ్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు, తడి, పొడి చెత్త వేరు విధానంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి

మెట్‌పల్లి పట్టణం: ప్రతి విద్యార్థి సేవాభావాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకయ్య అన్నారు. జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా బుధవారం డిగ్రీ కళాశాల ఆవరణలో వాలంటరీలతో పాటు కళాశాల అధ్యాపకులు కలిసి స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు.

కలెక్టర్‌ను కలిసిన భూనిర్వాసితులు

మెట్‌పల్లి: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బైపాస్ రహదారిలో భూములు కోల్పోతున్న మెట్‌పల్లి మండలం వెల్లుల్ల, మేడిపల్లి, బండలింగాపూర్‌కు చెందిన భూనిర్వాసితులు మంగళవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిశారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణంలో కోల్పోతున్న భూములకు బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని వినతిపత్రం సమర్పించారు.

కళోత్సవ్‌లో అలరించిన విద్యార్థులు

మల్యాల: మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయ భవనంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి కళోత్సవ్‌లో విద్యార్థులు తమ ప్రతిభతో అలరించారు. నృత్యం, చిత్రలేఖనం, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో ఆకట్టుకున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయి ఉత్సవాలకు పంపించనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

జగిత్యాల వ్యవసాయం: జగిత్యాల పొలాస వ్యవసాయ కళాశాలలో ఈ నెల 28న రైతులకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇవ్వనున్నట్లు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎల్లాగౌడ్ తెలిపారు. ఆసక్తిగల రైతులు 63051 89576లో సంప్రదించి తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు.

క్షయనివారణ అందరి బాధ్యత

జగిత్యాలే: క్షయ నివారణ అందరి బాధ్యతగా గుర్తించాలని జాతీయ బృందం ఎపిడమాలజిస్ట్ డాక్టర్ రాజేశ్వర్ అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని క్షయ నిర్ధారణ కేంద్రాన్ని చెన్నై నుంచి వచ్చిన జాతీయ బృందం సభ్యులు ఆసుపత్రిలో యంత్రాల పనితీరు, రికార్డులను పరిశీలించారు. సభ్యులు డాక్టర్ అస్గర్, దినేష్, సుధాకర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామంలో రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణానికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. రాయికల్‌లో గ్రంథాలయ భవన నిర్మాణానికి కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు. ఆర్డీవో మధుసూధన్, తహసీల్దారు అబ్దుల్ ఖయ్యూం, ఎంపీడీవో చీరంజీవి తదితరులున్నారు.

సాగులో రైతులు నూతన పద్ధతులు పాటించాలి

రాయికల్: సాగులో రైతులు నూతన పద్ధతులు పాటించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో రైతుమిత్ర ప్రొడ్యూసర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు బుధవారం అవగాహన సమావేశం నిర్వహించగా పాల్గొని సూచనలు చేశారు. జిల్లా వ్యవసాయాధికారిణి వాణి, మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్, సంఘ అధ్యక్షుడు అత్తినేని శంకర్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

కోరుట్ల: కోరుట్ల పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ బుధవారం భూమి పూజ చేశారు. 20వ వార్డులో రూ.10 లక్షల్లో నిర్మించిన కల్యాణ మంటపం ప్రారంభించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో భారాస రాజ్యసభ సభ్యుడు దామోదర్‌రావు ఎంపీ నిధులు రూ.2 లక్షలతో శుద్ధజల యంత్రం ఏర్పాటుకు, శాఖ గ్రంథాలయంలో రూ.2 లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కౌన్సిలర్లు పెండెం గణేష్, పేర్ల సత్యం, అన్వర్, బట్టు సునీల్, ఫయ్యూం, మోహన్‌రెడ్డి, ఆనంద్, ఆతీక్, తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ దుకాణాల్లో అవినీతిపై చర్యలకు వినతి

మెట్‌పల్లి పట్టణం: మెట్‌పల్లి ఖాదీ దుకాణాల సముదాయాల్లో చోటుచేసుకున్న అవినీతి, కారకులైన గుత్తేదారుడిపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకులు పుర కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. జెట్టి లక్షణ్, కొండ్ర అరుణ్, బొడ్ల ఆనంద్, కైలాస్, బన్నీ, సన్నీ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భాషా సామర్థ్యాలపై దృష్టిపెట్టాలి

కొడిమ్యాల: తెలుగు భాషా ఉపాధ్యాయులు విద్యార్థుల భాషా సామర్థ్యాలపై దృష్టిసారించి అభ్యాసన స్థాయిలను మెరుగుపర్చాలని నోడల్ అధికారి వెంకటస్వామి అన్నారు. కొడిమ్యాల మండలం తిర్మలాపూర్ గ్రామంలో కొడిమ్యాల, మల్యాల, పెగడపెల్లి మండలాలకు చెందిన తెలుగు భాషా ఉపాధ్యాయులు పాల్గొన్న కాంప్లెక్స్ సమావేశానికి వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జోత్స్నాదేవి, ఆర్పీలు జనార్ధనాచారి, బాలరాజు, సీఆర్పీ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

కొడిమ్యాల: అప్పారావుపేట గ్రామశివారులోని అక్రమ లే-అవుట్‌లో ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన గ్రామపంచాయతీ కార్యదర్శిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ మండలాధ్యక్షులు రేకులపల్లి రవీందర్‌రెడ్డి అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, ఎంపీవో వాసవికి బుధవారం ఫిర్యాదు చేశారు. అనుమతులు రద్దు చేయడంతో పాటు కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: కోరుట్ల అల్లమయ్యగుట్ట సాంఘిక సంక్షేమ మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాలలో మహిళా అతిథి అధ్యాపకులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ గునుక శ్రీలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులకు 27న ఉదయం 10 గంటలకు కోరుట్ల అల్లమయ్యగుట్ట కళాశాలలో డెమో ఉంటుందని వివరాలకు 83740 00563, 86393 65500లో సంప్రదించాలన్నారు.

బతుకమ్మ వేడుకలు

రాయికల్ పట్టణం: వాసవీ కిట్టీ పార్టీ ఆధ్వర్యంలో రాయికల్ పట్టణంలో బుధవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. పలు రకాల పూలతో బతుకమ్మ పేర్చి ఆటలతో సందడి చేశారు.

హాజరు శాతం ఉంటేనే అనుమతి

సారంగాపూర్: విద్యార్థులు కళాశాలకు క్రమం తప్పకుండా హాజరైనప్పుడే వార్షిక పరీక్షలకు అనుమతి ఉంటుందని ప్రిన్సిపల్ వై.రమేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పించడమే కాకుండా ఉత్తమ బోధన అందిస్తుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రతి వాహనదారుడు లైసెన్స్ తీసుకోవాలి

జగిత్యాల విద్యానగర్: ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల తాటిపల్లిలోని ఆర్టీవో కార్యాలయంలో ఎమ్మెల్యే లైసెన్స్ పునరుద్ధరణకు దరఖాస్తు చేశారు. టీవీవో శ్రీనివాస్, ఎంవీఐ రామారావు, వెంకన్న, ప్రమీల తదితరులున్నారు.

స్నేహితుల ఔదార్యం

బుగ్గారం: కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బుగ్గారానికి చెందిన బొడ్డు సురేష్‌కు మిత్రులు చేయూతనందించారు. చికిత్స కోసం రూ.30,500లను బుధవారం సురేష్‌కు అందించారు. గడ్డం రమేశ్, గయిని శ్రీనివాస్, సతీష్, నక్క రాజు పాల్గొన్నారు.

పుస్తకాల అందజేత

ధర్మపురి: ప్రభుత్వ ఉద్యోగాల అభ్యర్థులు మెలకువలు పాటించాలని విన్నర్స్ పబ్లికేషన్స్ సలహాదారులు, విషయ నిపుణుడు ప్రసన్న హరికృష్ణ సూచించారు. గ్రంథాలయంలో బుధవారం యువకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం వారికి విన్నర్స్ పబ్లికేషన్స్ పోటీ పరీక్షల పుస్తకాలను ఉచితంగా అందజేశారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

వెల్గటూరు : ముత్తునూరు ఉన్నత పాఠశాలలో 75 మంది విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టీషర్టులను పంపిణీ చేశారు. కరీంనగర్ రాజరాజేశ్వర, ధర్మారం లయన్స్ క్లబ్‌లు సంయుక్తంగా విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పూలమొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయురాలు విమలాదేవి, శశికళ, సంపతికుమారి, బాలకృష్ణారావు, టి.రవీందర్‌శెట్టి, కార్యదర్శి ముజాహిద్, కోశాధికారి కట్ట రమేష్, నర్సింగం పాల్గొన్నారు.